క్లుప్తంగా

తగ్గుతున్న నీటి నిల్వలు

ఏలేశ్వరం: వేసవి ఎండలు తీవ్రంగా ఉండడంతో ఏలేరు జలాశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి నీటి సరఫరా అంతంతమాత్రంగా ఉండడంతో నీటినిల్వలు తగ్గుముఖం పట్టాయి. దీంతో దిగువ ఆయకట్టుకు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో మంగళవారం నాటికి ప్రాజెక్టులో రూ.86.56 మీటర్లకు 76.64 మీటర్లు, 24.11 టీఎంసీలకు 9.83 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి విశాఖకు 200 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజుచెరువుకు నిలిపివేశారు.

నిందితురాలి అప్పగింత



మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

తుని: విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన నిందితురాలు పల్లి సంధ్యను చేబ్రోలు పోలీసులకు అప్పగించామని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై అనుమానిత మహిళ కనిపించిందన్నారు. దీంతో ఆమె గురించి ఆరా తీయగా చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో గత 5 ఏళ్ల నుంచి నాన్ మెయిల్ బుల్ వారెంట్‌పై తప్పించుకుని తిరుగుతుందన్నారు. దీంతో చేబ్రోలు పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

నేడు ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

గోకవరం: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ సంఘం తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం బుధవారం గోకవరంలోని గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో జరగనుంది. కమిటీ నూతన అధ్యక్షుడిగా గోకవరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బత్తుల సత్తిబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు కార్యదర్శిగా ఇన్నమూరి రాంబాబు, ట్రెజరర్‌గా కంకటాల మూర్తి తదితరులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

ఏలేశ్వరం: పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ నుంచి ప్రధాన రహదారి మీదుగా నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాన్‌లో జరిగి సంఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు కార్యక్రమంలో ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గండేపల్లి: మానవ మనుగడకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర తెలియజేశారు. నాయకంపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

తొండంగి: బెండపూడి జాతీయ రహదారిపై మంగళవారం కారు మోటారు సైకిల్ ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెండపూడి గ్రామానికి చెందిన బోనగిరి నూకరాజు(85) మోటారు సైకిల్ పై బెండపూడి గ్రామంలోకి వెళ్తుండగా గుర్తు తెలియని కారు రాజమండ్రి వైపు నుంచి విశాఖ వైపు వెళుతూ బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన నూకరాజును తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో భారీ వర్షం



ఏలేశ్వరంలో నేలకొరిగిన ఫ్లెక్సీ

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా మంగళవారం ఉరుములు ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో తీవ్రంగా ఇబ్బందులు పడిన ప్రజలు వర్షంతో కాస్త ఉపశమనం పొందారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. వర్షానికి చెట్లు నేలకొరిగాయి. పట్టణంలోని బాలాజీచౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు గాలులకు నేలకొరిగాయి. దీంతోపాటు రహదారులపై వర్షపునీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గోకవరం: మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలో మంగళవారం ఉదయం వాతావరణం వేడిగా, సాయంత్రం చల్లగా ఉంది. ఉదయం భానుడు భగభగ మండిపోతూ సాయంత్రం ఐదు గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మబ్బులు కమ్మి చిరుజల్లులు కురిశాయి. ప్రజలు సాయంత్రం సేదతీరారు.

జగ్గంపేట: మండలంలో భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రజల కష్టాలు

- వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడుతున్న జనం
- రోజుకు నగటున 135 లీటర్లకు 110 లీటర్లే సరఫరా
- నీటి వృథాతో తప్పని ఇబ్బంది



పట్టణంలో లీకవుతున్న మంచినీటి పైపులైన్లు

తుని: పురపాలక సంఘం బడ్జెట్ చూస్తే కోట్ల రూపాయాలలో ఉంది. ప్రజలకు మాత్రం పూర్తి స్థాయిలో మంచినీటిని సరఫరా చేయలేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు అమలు చేస్తున్న పథకాలకు పొంతన లేకుండా పోయింది. ఏటా తుని పురపాలక సంఘం మంచి నీటి కోసం రూ.95 లక్షలు ఖర్చు చేస్తోంది. ఇంత చేసినా ప్రజల దాహార్తిని తీర్చలేకపోతోంది. ఇందుకు ప్రధాన కారణం నీటిని సరఫరా చేసే పైపులైన్లు సరిగా లేకపోవడమే. అయితే ప్రజలకు తాగునీటిని అందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

ఇదీ పరిస్థితి : పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉన్నారు. రోజుకు సగటున 135 లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా ప్రస్తుతం 110 లీటర్లు అందిస్తున్నారు. పురపాలకసంఘంలో తొమ్మిది రిజర్వాయర్లు ఉన్నాయి. రోజుకు 60.10 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న పథకాలు, పైపులైన్లు వలన రోజుకు 55 లక్షల లీటర్ల నీటని అందిస్తున్నారు. పట్టణంలో పలు చోట్ల మెరక ప్రాంతాలకు సక్రమంగా నీరు అందడం లేదు.

ఏటా రూ.95 లక్షల వ్యయం

పురపాలక సంఘం పరిధిలో తొమ్మిది రిజర్వాయర్లు ఉన్నాయి. తాండవ నదిలో పవర్ బోర్లు ఉన్నాయి. అయినా పూర్తి స్థాయిలో నీటిని అందించలేకపోతున్నారు. డ్రైవర్స్ కాలనీ, కొండవారిపేట, టైలర్స్ కాలనీ, ఆరుగులవారి వీధి, సాయినగర్, అమ్మాజీపేట తదితర ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది. మంచినీటి కోసం ఖర్చు చేస్తున్న సొమ్ములో కేవలం 75 శాతం మాత్రమే ఆదాయం వస్తోంది. కోట్లలో ఖర్చు చేసినా అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు.

కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు

పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నాలుగేళ్ల క్రితం రూ.70 కోట్లు నిధులు కావాలని ప్రభుత్వానికి పంపిన నివేదికకు ఇంత వరకు అతిగతీ లేదు. ఎప్పుడో వేసిన పైపులైన్లు మార్పు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. ప్రస్తుత పాలకవర్గం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి నీటి పథకాల కోసం రూ.10 కోట్ల కావాలని అధికారులు నివేదిక పంపారు. ఈ నిధులు మంజూరు చేస్తే పైపులైన్లు మార్పు, కొత్త బోర్లు తదితర వాటికి వినియోగించేందుకు ప్రతిపాదించారు.

రూ.10 లక్షలతో వేసవి ప్లాన్

పట్టణంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా వేసవి ప్లాన్‌కు రూ.10 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. ఈ నిధులతో పైపులైన్ల మరమ్మతులు, చేతి పంపుల నిర్వాహణ, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు.



మార్కండ్రాజుపేటలో వీధి కుళాయికి ట్యాప్ లేక వృథా పోతున్న మంచినీరు

పూర్తి స్థాయిలో మంచినీరు అందక ఇబ్బంది

పురపాలక సంఘం చేస్తున్న ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో సరఫరా చేస్తున్న నీటికి పొంతన లేదు. రోజుకు ఉదయం సాయంత్రం కలిపి మనిషికి 110 లీటర్ల నీటిని అందిస్తున్నామని చెబుతున్నారు. ఇది పట్టణంలో ఎక్కడా అమలు కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రంగు మారిన నీరు వస్తుందని కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో పలు సార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మినరల్ నీటి కోసం కోసం నెలకు రూ.600 భారం పడుతుంది.

– సత్యవతి, సీతారాంపురం, తుని

తాగునీరు కొంటున్నాం

పురపాలకసంఘం సరఫరా చేస్తున్న నీరు రోజువారి అవసరాలకు వినియోగిస్తున్నాం. మంచనీటి కోసం మినరల్ వాటర్ బాటిల్స్ కొంటున్నాం. నాళా ద్వారా వచ్చే నీరు కలుషితం అవుతుంది. గతిలేని పరిస్థితిలో ప్రవేటు వ్యాపారుల నుంచి మంచినీటిని కోనుగోలు చేస్తున్నాం.

– ఎస్. నాగదేవి , టైలర్స్‌కాలనీ, తుని

ఆలయ భూముల కౌలు వేలం

శంఖవరం: ఎస్.జగ్గంపేట గ్రామంలో ఉన్న సీతా రామ చంద్రమూర్తిస్వామి భూములు కౌలుకు బహిరంగ వేలం నిర్వహించినట్టు ఈఓ అశ్విని తెలిపారు. ఆలయ ప్రాగంణంలో మంగళవారం జరిగిన వేలం పాట సర్వే నంబరు 78/2లో 3.32 ఎకరాలు, 24/1లో 6.09 ఎకరాల భూమిని వేలం నిర్వహించామన్నారు. అలాగే రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామంలో సర్వే నంబరు 65లో 10.45 ఎకరాల భూమిని వేలం వేసినట్టు తెలిపారు. గత ఏడాది రూ.56 వేలు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.1.16 వేలు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఈ వేలం పాట బైరా రాంబాబు, గవరసాని పాడుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మోగంటి తిరుపతి రాజు, జూనియర్ అసిస్టెంట్ పి.రాజుబాబు,టీడీపీ సీనియర్ నాయకుడు ఓలేటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో ఇద్దరి అరెస్టు

తుని: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని సీఐ పట్టాభి చౌదరి మంగళవారం తెలిపారు. వారి తెలిపిన వివరాల ప్రకారం.. రౌతులపూడి మండలం రాజవరానికి చెందిన దేవుడును అదుపులోకి తీసుకుని 40 లీటర్లు, కోటనందూరు మండలం కేఏ మల్లవరానికి చెందిన మణి గోవింద్ నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించామని చెప్పారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

తుని: పురపాలక సంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ వెంకట్రావు మంగళవారం తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

సోమరౌతు కుటుంబానికి ముద్రగడ పరామర్శ



రాజవరంలో పెద వెంకయమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: రాజవరంలో దివంగత మాజీ సర్పంచ్ సోమరౌతు చిట్రాజు భార్య పెద వెంకయమ్మ(96) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. చిట్రాజు కుటుంబం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ సభ్యుడు ముద్రగడ పద్మనాభానికి విధేయులుగా ఉన్నారు. ప్రస్తుతం సర్పంచ్‌గా పని చేస్తున్న ఆమె కోడలు వెంకట వరలక్ష్మి నరసయమ్మ, కుమారుడు తిరుముల వెంకన్నదొర వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పని చేసి పార్టీకి సేవలందిస్తున్నారు. వెంకయమ్మ మృతి సమాచారం తెలుసుకున్న ముద్రగడ ఫోన్‌లో వారి కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు వారిస్వగృహానికి వెళ్లి వెంకయమ్మ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సైపురెడ్డి వెంకటరమణ, రౌతులపూడి ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, సర్పంచ్‌లు, రాపర్తి రామకృష్ణ, కొరుప్రోలు దేవుడు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ సూచించారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు తూమురౌతు శ్రీనివాసరావు విద్యార్థులకు జనరల్ క్లాసెస్‌లో భాగంగా పార్ట్స్ ఆఫ్ బాడీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శృంగవృక్షంలో జెడ్పీ స్కూల్‌లో కలిసిన 1996-2021 బ్యాచి పూర్వ విద్యార్థులు

తొండంగి: శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్లో 1996 నుంచి 2001 వరకూ చదువుకున్న పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులంతా పరిచయం, నాటి తీపి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. ప్రస్తుతం పరిస్థితులపై చర్చించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహకారం చేసేందుకు నిర్ణయించుకున్నారు.

యోగాలో ప్రపంచ రికార్డు



తునిలో యోగా సాధకులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

తుని: యోగాలో ప్రపంచ రికార్డు సాధించిన ప్రణవ సంకల్ప యోగా సమితి విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య ఆకాంక్షించారు. మంగళవారం సాయంత్రం ఆర్యవైశ్య సంఘం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా గురువులను ఆమె సత్కరించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రణవ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్ అల్లూరి మన్యం జిల్లా అరుకులో 21 వేల మందితో 108 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు చేసి ప్రపంచ రికార్డు సాధించారన్నారు. ఇందులో తునికి చెందిన 35 మంది యోగా సాధకులు భాగస్వామ్యం ఉండడంతో వారిని సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సందరి, వైస్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మశీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: ఫార్మశీ రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నేత కంబాల శ్రీనివాసరావు అన్నారు. కొత్తపల్లి గ్రామంలో ఆదర్శ ఫార్మశీ కళాశాలలో ప్రయోగశాలకు నోబెల్ బహుమతి అందుకున్న వ్యక్తుల పేర్లు పెట్టే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఫార్మా రంగంలో 30 సంవత్సరాలు పని చేసి జనరల్ మేనేజర్ స్థాయికి వెళ్లానన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.కనకరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ త్రినాథరావు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.సుజిని తదితరులు పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మంగరాజుకు సత్కారం



మంగరాజును సత్కరిస్తున్న నాయకులు

గోకవరం: గోపాలపురానికి చెందిన ఆంధ్రప్రదేశ్ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజును మంగళవారం విజయవాడలోని బీసీ భవన్‌లో సత్కరించారు. బీసీ భవన్‌లో గౌడ కార్పొరేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన్ను గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, ఏపీఎస్‌ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఎండీ తనూజలు పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి



గిరిబాబును మర్యాద పూర్వకంగా కలిసిన నాయకులు

కిర్లంపూడి: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలో ఆయన నివాసంలో నూతనంగా ఎంపికైన రాష్ట్ర గ్రీవెన్సెల్ జాయింట్ సెక్రటరీ దాడిశెట్టి నూకాపతిరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయనను గిరిబాబు శాలువా, పూలమాలతో సత్కరించారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ రామశెట్టి బులి రామకృష్ణ, వైఎస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తుల నాగార్జున, తటవర్తి రామన్నదొర, ఏపూరి రామారావు, కోడి శ్రీను, ఉమ్మిడి తాతీయులు, పిల్ల చిన్నా తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు రూరల్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు మంగళవారం తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. టి.రాయవరం గ్రామానికి చెందిన బాలుడు ఎద్దు లక్ష్మీనారాయణ పదో తరగతి చదువుతున్నాడు. చదవడం లేదని తల్లి మందలించిందని ఇంట్లో నుంచి సైకిల్ పై ఇంట్లో నుంచి పరారయ్యాడు. దీని పై తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీ దర్యాప్తు చేపట్టి బాలుడు ఆచూకీ గుర్తించి మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు.

పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు కిట్లు



జగ్గంపేటలో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి భాస్కర్‌రావు

జగ్గంపేట: రాబోయే విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర జిల్లా ఇన్‌చార్జీ సీహెచ్ భాస్కరరావు తెలిపారు. జగ్గంపేటలో మంగళవారం విద్యార్థి మిత్ర కిట్లు స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేసే నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్స్,యూని ఫామ్స్, షూస్‌బెల్ట్స్, తదితర విద్యార్థి మిత్ర కిట్లను ఆయన తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్లో భద్రత ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికార్లు, మండల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి మిత్ర కిట్ల పాఠశాలలు తెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఈ విద్యాసంవత్సరం జగ్గంపేట మండలంలో 5842 మంది విద్యార్థులకు కిట్లు అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, జగ్గంపేట మండల విద్యాధికారి ఎం.స్వామి,విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల కిట్ల పరిశీలన

గండేపల్లి: 2025–26 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఇవ్వనున్న కిట్లను జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వర్రావు, జిల్లా ఇన్‌చార్జి సీహెచ్ భాస్కర్రావు మంగళవారం పరిశీలించారు. సర్వేపల్లి రాధా కృష్ణన్ విద్యార్థి మిత్ర పథకంలో భాగంగా విద్యార్థులకు అందజేయనున్న పాఠ్యపుస్తకాలు, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీచేశారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజున విద్యార్థులకు ఈ కిట్లు అందజేస్తామన్నారు. కిట్ల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించి లోపాలు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఎంఈఓ కేహెచ్ నాయక్ సిబ్బందికి తెలియజేశారు. మండలానికి సంబంధించి 3359 మంది విద్యార్థులకు ఈ కిట్లు అందజేయనున్నట్టు ఆయన తెలియజేశారు.

కౌలు రైతుల వివరాలు నమోదు చేయండి

శంఖవరం: కౌలు రైతులను గుర్తించి వారి వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ ఎ.తాతారావు వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో కౌలు రైతులు గుర్తింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో మీటింగ్ ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించాలన్నారు. కౌలు రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బోల్తా పడిన అరటి గెలల వ్యాన్

- ఆరుగురికి తీవ్ర గాయాలు, చికిత్స పొందుతూ ఒకరి మృతి
- అందరూ కాకినాడ జిల్లా వాసులే
- ద్వారకా తిరుమల మండలం గుణ్ణంపల్లి వద్ద ఘటన



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న అరటి గెలలు



తీవ్ర గాయాలతో రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులు

ద్వారకాతిరుమల: అరటి గెలల లోడుతో వెళుతున్న బొలేరో వాహనం టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపై బోల్తా పడింది. గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై, పోలవరం కుడి కాలువ వంతెన వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన పులుమంచుల ఆనందం(ఆనందరావు) అరటి గెలల వ్యాపారం చేస్తుంటాడు. ఎక్కడ తోటలో అరటి గెలలు ఉన్నా వాటిని కొనుగోలు చేసి, నరికించి, మార్కెట్‌కి తరలించి అమ్ముతుంటాడు. ఈ క్రమంలోనే ఏలూరు చుట్టుపక్కల ప్రాంతాల్లోని తోటల్లో అరటి గెలలను కొనుగోలు చేశాడు. వాటిని నరికేందుకు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం, లింగంపర్తికి చెందిన బొలేరో డ్రైవర్ కాకర లోవరాజు, భద్రవరానికి చెందిన పులుమంచుల ఈశ్వరరావు, లింగంపర్తికి చెందిన కోనా సత్యనారాయణ, అనుబోలు రామకృష్ణ(55), గుంప సూర్యనారాయణ(శివ)లు ఆనందంతో కలసి బొలేరో వ్యాన్‌లో వెళ్లారు. గెలలు నరికి, వ్యాన్‌లో లోడు చేసుకుని తిరిగి యర్రవరం మార్కెట్‌కు బయలుదేరారు. ఈ ప్రయాణంలో గుణ్ణంపల్లి దగ్గరకు వచ్చేసరికి వ్యాన్ వెనుక టైరు పంక్చర్ కావడంతో అది ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో సహా వ్యాన్‌లో ఉన్న ఆరుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులకు అటుగా వెళుతున్న వాహనదారులు సపర్యలు చేశారు. అనంతరం వారిని 108లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనుబోలు రామకృష్ణ మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు చికిత్స పొందుతున్నారు.